GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 8 | సంచిక : 1 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 16.07.2025 | పేజీలు : 3

## రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో టిప్పర్ దగ్ధం

**టీ మీడియా, జులై 15,%-%మక్తల్ :**



నారాయణపేట %-% కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణం కోసం మక్తల్ మండలం కచ్‌వార్ గ్రామం వద్ద రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పైపులు తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన కంపెనీకి ఇసుక తరలిస్తున్న టిప్పర్ దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. నారాయణపేట %-% కొండగట్టు పోతాల పథకం నిర్మాణం చేపట్టడం కోసం, మక్తల్ మండలం భూత్పూర్ జలాశయం నుండి పైపులైన్ ద్వారా నీటిని తరలించేందుకు, రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పైపులు తయారు చేస్తున్న క్రమంలో, ఇసుక సరఫరా చేస్తున్నటువంటి టిప్పర్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది, హుటాహుటిన ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ప్రమాదస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపు చేసింది. దీనిపై రాఘవ కన్‌స్ట్రక్షన్ సిబ్బందిని వివరణ కోరేందుకు చరవాణిలో సంప్రదించగా, సిబ్బంది అందుబాటులోకి రాలేదు.


# బీహార్ ఓటరు జాబితా

## నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్

# దేశస్థులు

## అనుమతి లేకుండా బీఎల్‌ఓలే అప్‌లోడ్





**టీ మీడియా,జులై 15, ఢిల్లీ బ్యూరో :**

### 11 పత్రాల్లో మా దగ్గర లేనివే ఎక్కువ..

కిషన్‌గంజ్‌లోని బూత్ నంబర్ 227 పరిధిలో రేహానా ఖాతూన్ అనే మహిళా ఓటరు ఉంటారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ సమస్యాత్మకంగా కనిపించిందని ఆమె తెలిపింది. ఓటు వేరిఫికేషన్ కోసం తాను ఆధార్ కార్డు, ఓటరు ఐడీలను ఇచ్చినట్లు వెల్లడించింది. అధికారులు అడుగుతున్న 11 పత్రాల్లో తమకు అందుబాటులో లేని పత్రాలే చాలా ఉన్నాయని పేర్కొంది. విదేశీయుల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించాలని, అయితే దేశ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని రేహానా ఖాతూన్ కోరారు.

### పూర్ణియాలో వాస్తవిక పరిస్థితి ఇదీ..

సరిహద్దు జిల్లా పూర్ణియాలోని చిమ్ని బజార్‌కు చెందిన బీఎల్‌ఓ సంజీవ్ కుమార్‌తో ఈటీవీ భారత్ మాట్లాడింది. ఇప్పటివరకు విదేశీ ఓటర్లను తాము గుర్తించలేదని సంజీవ్ కుమార్ చెప్పారు. వివాహం, ఉద్యోగం, వలసలు వంటి కారణాలతో ఏళ్ల తరబడి స్థానికంగా లేని వారి పేర్లను ఈసారి తొలగిస్తారని ఆయన తెలిపారు. అసలైన స్థానికుల ఓట్లకు ఇబ్బందేం ఉండదన్నారు. చాలా ఏళ్ల క్రితమే చనిపోయిన 10 మంది పేర్లను ఓటరు జాబితాలో గుర్తించినట్లు పేర్కొన్నారు.కాగా, ఈ జిల్లాలో ఓ చోట ఓటరుజాబితా నుంచి దాదాపు 400 మంది ముస్లింల పేర్లు గల్లంతైనట్లు గుర్తించారు. ఆధార్ కార్డును ఆప్షనల్ ధ్రువపత్రంగా ప్రకటించినప్పటికీ, పలుచోట్ల దాన్ని కూడా వేరిఫికేషన్ కోసం వినియోగించినట్లు తెలిసింది.

### 'స్థానికుల మద్దతుతోనే విదేశీయులకు ఓట్లు'...

బిహార్‌లోని సరిహద్దు జిల్లాల ప్రజలకు పొరుగు దేశాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో బంధువులు ఉంటారని సీనియర్ జర్నలిస్ట్ సునీల్ పాండే అన్నారు. 'అక్కడున్న వారికి మత ప్రాతిపదికన స్థానికంగా మద్దతు లభిస్తుంటుంది. స్థానికుల సాయంతోనే ఎంతోమంది బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్ దేశాల ప్రజలు బిహార్ సరిహద్దు జిల్లాల్లో ఓటు హక్కును పొందారు. ఈ విషయంలో వారికి అవినీతిపరులైన అధికారులు, ఉద్యోగులు సహకరించారు. ఇలాంటి వాళ్ల సాయంతోనే విదేశీయులు వివిధ సర్టిఫికెట్లను మనదేశంలో ఈజీగా పొందుతున్నారు. చాలాసార్లు సరైన తనిఖీలు లేకుండానే ఓటుహక్కును మంజూరు చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలకు పాల్పడే వారిపై కేంద్ర హోంశాఖ, కేంద్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలి' అని సీనియర్ జర్నలిస్ట్ సునీల్ పాండే పేర్కొన్నారు.

**బీహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ జరుగుతున్న కొద్దీ కీలక సమాచారం వెలుగులోకి వస్తోంది. రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాలైన అరారియా, కతిహార్, కిషన్‌గంజ్, పూర్ణియాలలోని ఓటర్ల జాబితాలలో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్తుల పేర్లు ఉన్నాయంటూ ఓ ప్రముఖ వార్తాసంస్థ కథనాన్ని ప్రచురించింది. ఈ అంశంపై ప్రస్తుతం ఎన్నికల కమిషన్ క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయిస్తోందని వెల్లడించింది. విదేశీయుల పేర్లు ఓటరు జాబితాల్లో ఎలా చేరాయనే సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈసీ ప్రయత్నం చేస్తోందని పేర్కొంది. ఈ కథనంలోని సమాచారం వాస్తవం అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాలని ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో .బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ జరుగుతున్న కొద్దీ కీలక సమాచారం వెలుగులోకి వస్తోంది. రాష్ట్రంలోని దేశ సరిహద్దు జిల్లాలైన అరారియా, కతిహార్, కిషన్‌గంజ్, పూర్ణియాలలోని ఓటర్ల జాబితాలలో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్తుల పేర్లు ఉన్నాయంటూ కథనాలు వెలువడ్డాయి. ఈ అంశంపై ప్రస్తుతం ఎన్నికల కమిషన్ క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయిస్తోందని వెల్లడించింది. విదేశీయుల పేర్లు ఓటరు జాబితాల్లో ఎలా చేరాయనే సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈసీ ప్రయత్నం చేస్తోందని పేర్కొంది. బీహార్ సరిహద్దు జిల్లా కిషన్‌గంజ్‌లో జరుగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ సభాగంగా కిషన్‌గంజ్ బూత్ నంబర్ 227లోని బూత్ లెవల్ అధికారి మహ్మద్ దానిష్ ఇక్బాల్‌ను కలిశారు. ఓటరు జాబితాల్లో విదేశీయుల పేర్లు ఉన్నట్లు ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. 2003 నాటి ఓటరు జాబితా ప్రాతిపదికన తాము ఓటర్లను వేరిఫై చేస్తున్నట్లు చెప్పారు. 11 పత్రాలలో ఏదైనా ఒక పత్రాన్ని సమర్పించి ప్రజలు ఓటును వేరిఫై చేయించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు తమకు ప్రజలు సమర్పించిన ఫామ్‌ల ప్రకారం విదేశీయులు ఎవరూ లేరన్నారు.**

### 'మోదీ, షా, నితీశ్‌లే బాధ్యత వహించాలి'...

బిహార్‌లో 20 ఏళ్లు, కేంద్రంలో 11 ఏళ్లు ఎన్‌డీఏ ప్రభుత్వమే ఉందని, విదేశీయులు ఎవరైనా దేశంలోకి ప్రవేశిస్తే దానికి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఎం నితీశ్ కుమార్‌లే బాధ్యత వహించాలని ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ అన్నారు. దేశానికి, రాష్ట్రానికి భద్రతను కల్పించే స్థానంలో ఉన్న ఆ ముగ్గురే విదేశీ ఓటర్ల చేరికకు బాధ్యతను తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ విదేశీ ఓటర్ల బలంతోనే బిహార్‌లో ఓసారి 40 లోక్‌సభ స్థానాల్లోని 39 సీట్లను, మరోసారి 40 లోక్‌సభ స్థానాల్లోని 33 సీట్లను ప్రధాని మోదీ గెల్చుకున్నారని తేజస్వి విమర్శించారు. ఈ విదేశీయుల దన్నుతోనే నితీశ్-బీజేపీ 20 సంవత్సరాలుగా బిహార్ అధికార పీఠంపై కూర్చున్నారా? అని ఆయన ప్రశ్నించారు.

### అనుమతి లేకుండా బీఎల్‌ఓలే అప్‌లోడ్...

'ఓటరు జాబితా సమగ్ర సవరణలో భాగంగా బిహార్‌లో 80.11 శాతం మంది ఓటర్లు లెక్కింపు ఫామ్‌లను నింపారని ఎన్నికల కమిషన్ అంటోంది. అయితే వీటిలో ఎన్ని ఫామ్‌లను ఓటర్లు స్వచ్ఛందంగా, చెల్లుబాటు అయ్యేలా నింపారో చెప్పడం లేదు. ఎంతోమంది ఓటర్ల అనుమతి తీసుకోకుండానే వారి నకిలీ బొటనవేలు ముద్రలు, సంతకాలను ఉపయోగించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఫామ్‌లను అప్‌లోడ్ చేస్తున్నారని క్షేత్రస్థాయి నుంచి మాకు సమాచారం అందుతోంది. అందుకే ఎన్నికల సంఘం వద్దనున్న సమాచారం వాస్తవ విరుద్ధమైంది. డాక్యుమెంట్లు లేకుండా, ఓటర్ల ప్రత్యక్ష భాగస్వామ్యం లేకుండా ఎన్ని ఫామ్‌లు అప్‌లోడ్ అయ్యాయో ఎన్నికల సంఘం ఇంకా చెప్పలేదు. 4.66 కోట్ల డిజిటలైజ్డ్ ఫామ్‌లలో ఎన్ని ఆధార్/ఓటరు ఐడీతో ధృవీకరణ పొందాయో వెల్లడించాలి. ఫేక్ అప్‌లోడింగ్ జరిగేందుకు ఉన్న అవకాశాలపై ఎన్నికల కమిషన్ మౌనంగా ఉంది. ఓటరు వేరిఫికేషన్ కోసం డాక్యుమెంట్లను తదుపరిగానూ సమర్పించొచ్చని ఈసీ చెప్పింది. అయితే ఇందుకు డెడ్‌లైన్ ఏమిటనేది వెల్లడించలేదు. దీనివల్ల క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు, ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు' అని ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

# సేద్యం లేదు- చేతిలో డబ్బుల్లేవు

- రాజధాని రైతుల ఇక్కట్లు
- స్పందించని బ్యాంకర్లు



**టీ మీడియా,జులై 15,అమరావతి బ్యూరో:**

రిటర్నబుల్ ప్లాట్లపై బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన విధంగానే ఇప్పుడూ మంజూరు చేయాలని కోరుతున్నా బ్యాంకర్ల నుంచి స్పందన లేదు. వివిధ అవసరాల కోసం ప్లాట్లను తాకట్టు పెట్టి రుణం తీసుకుందామన్నా చుక్కెదురవుతోంది. అటు సేద్యం లేక, ఇటు కుటుంబ అవసరాల కోసం చేతిలో డబ్బుల్లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

### దిక్కుతోచని పరిస్థితి

రాజధాని నిర్మాణానికి 34,385 ఎకరాల భూమిని సీఆర్డీఏ సమీకరించింది. రైతులతో ఒప్పందం మేరకు వారికి నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించింది. భూములిచ్చిన వారిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ మంది ఉన్నారు. ఎకరాలోపు 20,490 మంది ఇచ్చారు. ఒకటి నుంచి రెండెకరాల్లోపు ఇచ్చిన వారు 5 వేల మందికి పైగా ఉన్నారు. పిల్లల చదువులు, వివాహాలు, ఆరోగ్య అవసరాలు, ఇళ్ల నిర్మాణాలకు ప్లాట్లను తాకట్టు పెట్టి రుణాలు పొందేందుకు అన్నదాతలు బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించడం లేదు. బిడ్డల ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు పంపాలన్నా చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని పరిస్థితి. పలువురు రైతులు వచ్చిన కాడికి ప్లాట్లను విక్రయించి పిల్లలను చదివిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం, చిరు వ్యాపారాలకూ డబ్బుకు కటకటలాడాల్సిన పరిస్థితులు.

### ఐదేళ్లు నరకం అనుభవించాం

వ్యవసాయం లేక ఖాళీగా: వెంకటపాలేనికి చెందిన సాంబశివరావు 81.6 సెంట్ల భూమిని ఇచ్చారు. సీఆర్డీఏ ఆయనకు 810 చదరపుగజాల నివాస, 360 చదరపు గజాల వాణిజ్య ప్లాట్లను కేటాయించింది. పెద్ద కుమార్తెకు వివాహం చేయగా మరో కుమార్తె, కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నారు. పిల్లల చదువులు, సొంతిల్లు నిర్మాణానికి రూ. 10 లక్షల అప్పు చేశారు. ప్రస్తుతం వ్యవసాయం లేక ఖాళీగా ఉంటున్నారు. ప్లాట్లు విక్రయిద్దామనుకున్నా మంచి ధర లేదు. సీఆర్డీఏ ఇచ్చిన ప్లాట్లపై బ్యాంకులో రుణం ఇవ్వకపోవటంతో అప్పులకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి. శాఖమూరుకు చెందిన రాజు స్థానికంగా వెల్డింగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఒక కుమార్తె 10వ తరగతి, మరొకరు 4వ తరగతిలో ఉన్నారు. పూలింగ్‌లో తండ్రి సుబ్బారావు, సోదరుడు శ్రీనివాసరావుతో కలిసి ఎకరా ఇచ్చారు. వెయ్యి చదరపు గజాల నివాస ప్లాట్‌ను గతంలో కుటుంబ అవసరాల కోసం తక్కువ ధరకు అమ్ముకున్నారు. ఇంకా 250 చదరపు గజాల వాణిజ్య ప్లాటు మిగిలింది. అప్పులు చేసి సొంతింటి నిర్మాణం చేపట్టారు. సమీప బంధువు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 15 లక్షల అప్పు చేశారు. ఇంటి నిర్మాణం సగంలో నిలిచిపోయింది. ప్రస్తుతం భార్యతో పాటు కూలి పనులకు వెళ్తున్నారు. ప్లాట్‌పై రుణం ఇప్పిస్తే అప్పుల ఊబి నుంచి బయటపడతామంటున్నారు.

### మార్గదర్శకాలు లేవంటూ

వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్న సమయంలో మూడు రాజధానుల వైఖరితో అమరావతి నిర్మాణ పనులు నిలిపేసింది. అప్పట్నుంచి బ్యాంకులు రుణాలివ్వడం లేదు. సీఆర్డీఏ ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించినా బ్యాంకర్లతో మాట్లాడి పరిష్కరిస్తామని చెబుతున్నా ఫలితం కనిపించడం లేదు. ప్లాట్లపై రుణాల మంజూరులో తమకు మార్గదర్శకాలు లేవంటూ బ్యాంకర్లు పట్టించుకోవడం లేదు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ)లో సానుకూల నిర్ణయం తీసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మూడు నెలల క్రితం జరిగిన సమావేశంలో సీఆర్డీఏ వద్ద రిజిస్టర్ అయిన ప్లాట్లపై రుణాలివ్వాలని అధికారులు కోరినా ఇప్పటి వరకు కార్యాచరణ ప్రారంభం కాలేదు. మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు.

# నిమిష ప్రియ ఉరిశిక్ష వాయిదా

## ఫలిస్తున్న విదేశాంగ శాఖ యత్నాలు



**టీ మీడియా,జులై 15,ఢిల్లీబ్యూరో :**

మరికొన్ని గంటల్లో ఉరికంబం ఎక్కాల్సిన కేరళ నర్స్ నిమిష ప్రియకు ఊరట లభించింది. బుధవారం(జులై 16) అమలు కావాల్సిన ఆమె ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఓ ప్రకటన చేసింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.ఈ కేసులో బాధితురాలికి సాయం చేసేందుకు భారత్? ప్రభుత్వం మొదటి నుంచి తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. నిమిష, బాధిత కుటుంబాల మధ్య పరస్పర అంగీకరానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా మరింత సమయం ఇవ్వాలని కోరాం. ఈ విషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయి. మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారు' అని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి.ఇక ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరపుతున్నారు. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్ల) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్దంగా ఉంది. ఇందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది.

### అసలేమిటీ కేసు...

కేరళ పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష నర్సు కోర్సు పూర్తి చేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. 2011లో థామస్‌ను వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకొన్నారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక తలాల్ అదిబ్ మెహది అనే వ్యక్తిని నిమిష, థామస్ జంట తమ వ్యాపార భాగస్వామిగా చేసుకొన్నారు. వారు అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. కొన్నేళ్ల తర్వాత ఆమె భర్త, కుమార్తె కేరళకు వచ్చేశారు. నిమిష యెమెన్‌లోనే ఉంటూ సెంటర్‌ను కొనసాగించారు.ఈ సమయంలో మెహది- నిమిష ప్రియను తన భార్యగా పేర్కొంటూ వేధింపులకు గురిచేస్తూ ఆమె పాస్‌పోర్టు లాక్కొన్నాడు. అతడిపై 2016లో ప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోయేసరికి, 2017లో మెహదికి మత్తు మందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని ఆమె భావించింది. మోతాదు ఎక్కువవడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పడేసింది. అక్కడి నుంచి సౌదీకి పారిపోతుండగా ఆమెను అరెస్టు చేశారు. ఈ కేసులో 2020లో ఆమె ఉరిశిక్ష విధించగా, 2023లో చివరి అప్పీల్‌ను యెమెన్ ప్రభుత్వం తిరస్కరించింది. ప్రస్తుతం నిమిష ప్రియ యెమెన్ రాజధానిలోని సనా జైలులో ఉంది.

# కుండపోత కాలంలో ఉక్కపోత

- వేసవిని తలపిస్తున్ననైరుతి వేళ

**టీ మీడియా,జులై 15,అమరావతి బ్యూరో:**



హార్బర్‌లో గొడుగు నీడన చేపలు

నైరుతి రుతుపవనాల కాలంలోనూ వేడి తగ్గలేదు. ఉపరితల ఆవర్తనాల ప్రభావం కారణంగా ఈ సంవత్సరం ప్రారంభంలోనేట్క వడగాలుల తీవ్రత తగ్గి, వేసవి ముందుగానే పూర్తయింది. ఎండ తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. పొడి వాతావరణం వల్ల వారం రోజులుగా వర్షాకాలంలో కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. పశ్చిమ బెంగాల్ నుంచి ఉత్తరప్రదేశ్ వరకు వెనువెంటనే అల్పపీడనాలు ఏర్పడుతున్నాయి. ఈ కారణంగా తేమ అక్కడే ఉండి పోవడం వల్ల దిగువ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది.పల్నాడు జిల్లాలో అత్యధికంగా: రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో 39 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పల్నాడు జిల్లాలోని జంగమహేశ్వరపురంలో సోమవారం నాడు అత్యధికంగా 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కళింగపట్నం, విశాఖపట్నం, తుని, కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కడప వంటి తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 7 డిగ్రీల వరకు పెరిగాయి.విజయవాడ, విశాఖ నగరాల్లో ఎండ తీవ్రతకు బయటకు వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. ఏసీలు, కూలర్లపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ నెల 18 తర్వాత వర్షాలు కురుస్తాయని భావిస్తున్నారు. ద్రోణి ఏర్పడే అవకాశం ఉందని, దాని ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భావిస్తున్నారు. ఉత్తరాన భారీ వర్షాలు: ఉత్తర భారతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంగా పరివాహక పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ పరిసరాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. ఇది మంగళవారం నాటికి పశ్చిమ-వాయవ్య దిశగా గంగా పరివాహక పశ్చిమబెంగాల్ మీదుగా కదలనుందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు మధ్యప్రదేశ్, రాజస్థాన్, పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది రాబోయే రెండు రోజుల్లో పశ్చిమ-వాయవ్య దిశగా రాజస్థాన్ మీదుగా ప్రయాణించనుంది. దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్, సిక్కిం, ఝార?ండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## గవర్నర్ వద్దకు...

# చట్ట సవరణ ఆర్డినెన్స్

3లో..

# కిరాణా,చికెన్ దుకాణాల్లో మద్యం

- బాటిల్ పై రూ.ఇరవై ,నలభై అదనం

**టీ మీడియా, జులై 15, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలో బెల్ట్ షాపుల దందా మూడు బాటిళ్లు ఆరు కాసులుగా తయారైంది. అబ్కారిశాఖ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా కాలనీలలో, గ్రామాల్లో మంచినీళ్లు దొరకని షాపులు ఉన్నాయంటే నమ్మశక్యం కాదు , మద్యం దొరకని చోటంటూ లేకపోవడం గమనార్హం. గ్రామాల్లో చాలామంది బెల్ట్ షాపులోనే ఉపాధిగా ఎంచుకుంటున్నారు. నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసిన బ్రాండ్లమద్యం దొరుకుతోంది. వైన్ షాపుల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది. ప్రతి కిరాణా, చికెన్ దుకాణాల్లో మద్యం 24 గంటలు లభిస్తూ ఉండడంతో యువత,మద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీలకు బదులుగా మద్యంను తాగుతూ ఎక్కడ పడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, హరిజనవాడ, మారెమ్మ కుంట, గాంధీ చౌక్ , పీర్లగుట్ట, అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్,పాత బస్టాండు, నాగవరం, చందాపురం రోడ్డు వంటి ఏరియాలలో టీ కొట్టులో, దుకాణాలలో, చికెన్ సెంటర్లలో మద్యం విక్రయిస్తున్నారు.కొందరు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు







చేస్తున్నారు. జిల్లా లో మద్యం ఏరులై పారుతున్న కనీసం అటువైపు ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడకుండా వ్యవహరిస్తున్నారు.

**అధికారుల అండతో**

అధికారులు, స్థానిక నాయకుల అండదండలతో బెల్టు షాపుల యజమానుల దందా మూడు కోటర్లు, ఆరు బీర్లు అన్నచందంగా మారింది. సమాచారం ఇచ్చిన బెల్టు షాపులపై తనిఖీలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్ షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సమాచారం ఇస్తే ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. అధికారులకు బెల్టు షాపుల నుంచి భారీగా ముడుపులు అందడంతోనే అటువైపు కన్నెత్తి చూడట్లేదని చెబుతున్నారు.

**వైన్ షాపులకు అనుబంధంగా**

ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 60 – 70 పైనే బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నా, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వాహనాల ద్వారా మద్యం సరఫరా చేస్తూ బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మార్పీ రేటు కంటే 40 రూపాయలు అదనంగా ప్రతి బాటిల్ కు వసూలు చేస్తూ వైన్ షాప్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. . ఒక్కో వైన్ షాపులో సగటున రోజు 5 లక్షల రూపాయల వరకు అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# తల్లిని గెంటేసిన కొడుకులు

- ఆర్డీవోకు ఫిర్యాదు

**టీ మీడియా, జులై 15,జగిత్యాల :**
కన్నతల్లిని కొడుకులు ఇంట్లో నుంచి గెంటేసిన అమానవీయ ఘటన జగిత్యాల జిల్లాలో వెలుగుచూసింది. కొడుకులు, కోడళ్లు తనను పోషించక పోగా ఇంట్లోంచి కొట్టి గెంటి వేశారని సారంగపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన తులసి వెంకటవ్వ, సీనియర్ సిటిజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్‌ను ఆశ్రయించింది. ఆయన సాయంతో ఆర్డీవో మధుసూదన్‌కు మంగళవారం ఫిర్యాదు చేసింది.




కొడుకులు విదేశాలకు వెళ్లి బాగా సంపాదిస్తున్నా తనకు తిండి పెట్టక కొట్టి ఇంట్లోంచి వెళ్లగొట్టారని కొడుకులు జగన్, మహేష్, కోడళ్లు గంగ, గౌతమిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధుసూదన్ మాట్లాడుతూ.. వయో వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారి పిల్లలదేనని, లేనిచో జైలు శిక్ష, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరు కొడుకులు, కోడళ్లపై వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం సెక్షన్ 2(బి),సెక్షన్ 4(1), సెక్షన్ 24 ప్రకారం కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేయాలని వృద్ధుల చట్టం అసిస్టెంట్ పద్మజను ఆదేశించారు.ఆ వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కౌన్సెలింగ్ అధికారి పీసీ హన్మంత రెడ్డి, ప్రతినిధులు వెల్ముల ప్రకాష్ రావు, దిండిగాల విఠల్, సత్యనారాయణ తదితరులున్నారు.



## ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నూతన రికార్డు

**టీ మీడియా, జులై 15,హైదరాబాద్ బ్యూరో :**
ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సరికొత్త చరిత్రను సృష్టించింది. విభాగం విద్యార్థుల్లో 90 శాతం మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లలో ఉద్యోగాలు సాధించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలలో అత్యధికంగా ఫెడరల్ బ్యాంకు ఒక విద్యార్థికి రూ. 16 లక్షల వార్షిక వేతనం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మరో విద్యార్థికి రూ. 8 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు అందజేశాయి. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను వర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, విభాగం హెడ్ ప్రొఫెసర్ జహంగీర్, డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ స్మిత సాంబ్రాణి, డాక్టర్ విద్యాసాగర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## వైద్యం కోసం ఎల్ఓసి

- జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, జులై 15, వనపర్తి బ్యూరో :**
పెబ్బేరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి అనే బాధిత కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మహాత్మ జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో రెండు లక్షల యాభై వేల ఎల్ఓసి ని అందజేశారు. శ్రీకాంత్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మెరుగైన వైద్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం తరఫున రెండు లక్షల యాభై వేల ఎల్ ఓసి ని మంజూరు చేయించి బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్ ఓ సి అందుకున్న బాధితుని కుటుంబ సభ్యులు ప్రజా ప్రభుత్వానికి, జిల్లెల చిన్నారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ పాల్గొనడం జరిగింది.

## హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**టీ మీడియా, జులై 15,కమలాపూర్ :**
హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. 30 పడకల దవాఖానలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.హాస్పిటల్‌లో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయో డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా వైద్యాధికారి అప్పయ్య, పలు శాఖల అధికారులు ఉన్నారు.





## మాజీ మంత్రి వివాహ వార్షికోత్సవ వేడుకలు

**టీ మీడియా జులై 15,ఎండపల్లి:**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్నేహలత వివాహ వార్షికోత్సవ వేడుకలు మండలంలోని కొండాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగానిర్వహించారు.తధానంతరం భరస మండల అధ్యక్షులు సింహాచలం జగన్,మాట్లాడుతూ. దంపతులు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉండాలని వివాహ వార్షికొత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో మండల నాయకులు గాజుల మల్లేశం,చుంచు మల్లేశం,మేరుగు జానీ, పడిదంనారాయణ,పడిదం వెంకటేష్ ,గాదం భాస్కర్ బూరగడ్డ మౌనిక,చొప్పరి పద్మ గంగాధరి శేఖర్, ఇప్పల నాగరాజు,ఇప్పల రాజ్ కుమార్,దర్శనాల లచ్చయ్య,కమలాకర్ దేవేందర్,వెన్నెంకా తిరుపతి,రాకేష్,సురేష్, పోశయ్య,నరసయ్య ,చందు,తిరుపతి ,మొగిలినాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీలు, ట్రాక్టర్ల ధరలు తగ్గే ఛాన్స్?

- 12 శాతం శ్లాబ్ రద్దు?
- జీఎస్టీలో కీలక మార్పుల

**టీ మీడియా,జులై 15,ఢిల్లీబ్యూరో**
ప్రస్తుతం అందరి చూపు రెండు వారాల్లో జరగబోయే జీఎస్టీ మండలి 56వ సమావేశం వైపే ఉంది. ఈసారి జరిగే భేటీలో అన్ని విభాగాల ఉత్పత్తుల జీఎస్టీ రేట్లను సమీక్షిస్తారనే అంచనాలు వెలువడుతున్నాయి. ఏసీలు, ట్రాక్టర్లు సహా పలు ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించే అవకాశం ఉందని అంటున్నారు. పూర్తిస్థాయి టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై జీఎస్టీని రద్దు చేయొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈ అంశాలపై ఓ లుక్ వేద్దాం.




**జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ**

జీఎస్టీ మండలికి ఛైర్‌పర్సన్‌గా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నారు. జీఎస్టీ మండలి సమావేశాలకు ఎజెండాను ఆమెనే నిర్ణయిస్తారు. ఈ సమావేశాల్లో భాగంగానే తీసుకునే నిర్ణయాలను అమల్లోకి తెచ్చే బాధ్యత కూడా కేంద్ర ఆర్థిక మంత్రికే ఉంటుంది. చివరిసారిగా 2024 డిసెంబరులో జీఎస్టీ మండలి 55వ సమావేశం జరిగింది. అప్పటి నుంచే జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ చేయాలనే డిమాండ్ ఉంది. ఈసారి భేటీలో దీన్నే ప్రధాన ఎజెండాగా ఎంచుకునే అవకాశం ఉందని పలువురు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా అన్ని విభాగాల జీఎస్టీ రేట్లను సమీక్షించే అవకాశం ఉందని అంటున్నారు. పలు విభాగాలపై విధించే జీఎస్టీ రేట్లను తగ్గించే సూచనలు ఉన్నాయని చెబుతున్నారు.

**జీఎస్టీ మండలి పరిశీలించనుందా?**

జీఎస్టీ రేట్లలోని 12 శాతం శ్లాబ్‌ను తొలగించే అవకాశం ఉంది. ఇప్పటివరకు 12 శాతం శ్లాబ్‌లో ఉన్న పలు వస్తువులు, ఉత్పత్తులను 5 శాతం లేదా 18 శాతం శ్లాబ్‌లలో చేర్చే సూచనలు ఉన్నాయి. పూర్తిస్థాయి టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని రద్దుచేసే అంశాన్ని పరిగణనలోకి తీసుకునే ఛాన్స్ ఉంది. టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు 5 శాతం జీఎస్టీ శ్లాబ్‌లోకి చేరొచ్చు. అయినప్పటికీ బీమా కంపెనీలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఏసీలు, ట్రాక్టర్లు వంటి వాటిపై జీఎస్టీ బాదుడు బాగా తగ్గే సంకేతాలు ఉన్నాయి. ప్రస్తుతం ట్రాక్టర్లు 12 శాతం జీఎస్టీ శ్లాబ్‌లో ఉన్నాయి. ఈ శ్లాబ్‌నే పూర్తిగా ఎత్తేస్తారనే అంచనాలు వెలువడుతున్నాయి. అదే జరిగితే ట్రాక్టర్లు 5 శాతం శ్లాబ్‌లోకి చేరే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో ట్రెమ్–4 (%ు=జువీ–×ు%) ప్రమాణాలతో కూడిన ట్రాక్టర్లనే మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. ఈ ప్రమాణాల ప్రకారం ట్రాక్టర్ల తయారీకి కంపెనీలు అదనపు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇందుకుగానూ జీఎస్టీ తగ్గింపుతో ఊరట పొందాలని కంపెనీలు భావిస్తున్నాయి.

ఏసీలు ప్రస్తుతం 28 శాతం జీఎస్టీ శ్లాబ్‌లో ఉన్నాయి. 2026 జనవరి నుంచి బీఈఈ ప్రమాణాల ప్రకారం పనిచేసే ఏసీలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రమాణాలతో కూడిన ఏసీల తయారీకి కంపెనీలకు సగటున 3 శాతం నుంచి 5 శాతం మేర ఖర్చు పెరుగుతుంది. ఒకవేళ ఏసీలపై జీఎస్టీని కేంద్ర సర్కారు తగ్గిస్తే వోల్టాస్, హావెల్స్ లాంటి ఏసీల తయారీ కంపెనీలకు భారీ ఉపశమనం లభిస్తుంది.

**రాష్ట్రాలకు 'సెస్' పంపిణీలో కీలక మార్పులు**

జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలకు కలిగే రాబడి నష్టాలను పూడ్చేందుకు జీఎస్టీ కంపెన్సేషన్ సెస్‌ను కేంద్ర ప్రభుత్వం విధిస్తోంది. పెద్ద కార్లు, ఎస్‌యూవీల వంటి ఎంపిక చేసిన వస్తువులు, సేవలపై దీన్ని విధిస్తున్నారు. ఈ సెస్ అమలు గడువు 2026 మార్చితో ముగియనుంది. ఈ ఒక్క సెస్ స్థానంలో ఆరోగ్య సెస్, క్లీన్ ఎనర్జీ సెస్ అనే రెండు కొత్త పన్నులను అమల్లోకి తెచ్చే అవకాశం ఉందని ప్రఖ్యాత అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ నోమురా పేర్కొంది. జీఎస్టీ కంపెన్సేషన్ సెస్ అమలు గడువు ముగిశాక, అమల్లోకి వచ్చే రెండు కొత్త సెస్‌లు కూడా దాదాపు అంతే రేంజులో ఉంటాయని అంచనా వేసింది. అయితే ఈ సెస్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సమకూరే ఆదాయాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేసే వ్యవస్థలో మార్పులు జరగొచ్చని నోమురా తెలిపింది. కేంద్ర సర్కారు ఆమోదం తర్వాతే ఈ సెస్ ఆదాయాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేసేలా మార్పులు ఉండొచ్చని అంచనా వేసింది.

## గవర్నర్ వద్దకు...

# చట్ట సవరణ ఆర్డినెన్స్

**-స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్**

**టీ మీడియా, జులై 15,హైదరాబాద్ బ్యూరో: :** తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా సర్కారు నిర్ణయంతో రాజ్‌భవన్‌కు చేరింది. పంచాయతీరాజ్ చట్టం–2018లో సవరణల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్? వర్మకు పంపించింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్–ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర కేబినెట్? నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే 285 క్లాజ్?–ఎ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అమలవుతాయని ఉంది. అందులో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరించాలని నిర్ణయించారు.

**న్యాయశాఖ ఆమోదం తర్వాత**

పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు విధించిన గడువు (సెప్టెంబర్ 30) సమీపిస్తున్నందున ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ ఈ ఫైలును న్యాయశాఖ ఆమోదించిన తర్వాత మంత్రి, ముఖ్యమంత్రి ఆమోదంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్? ముసాయిదాగా పంపించింది.

**బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు**

ఆర్డినెన్స్? గవర్నర్ ఆమోదం పొందితే చట్ట సవరణ వెంటనే అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా బీసీ డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్సు చేయనుంది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, స్టేట్? ఎలక్షన్ కమిషన్?కు




పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు గడువు విధించిన సంగతి తెలిసిందే.2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలని, అన్ని రాష్ట్రాల్లో ఈ రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయం సాధించినట్లవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల మంత్రివర్గ సమావేశం అనంతరం వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో కాంగ్రెస్ బీసీ నేతలు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇతర నాయకులు వేర్వేరుగా సీఎం రేవంత్? రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

**బీజేపీ ప్రభుత్వానిదేనని**

తాము ఒత్తిడి తీసుకురావడంతోనే కేంద్ర ప్రభుత్వం 2026లో జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని నిర్ణయించిందని, బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని రేవంత్? రెడ్డి విమర్శించారు. వాటిని రాజ్యాంగంలో చేర్చి, చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్యలు బీసీ రిజర్వేషన్లపై తమ అగ్ర నాయకులను ఒప్పించి విజయం సాధించాలని పేర్కొన్నారు.

**సామాజిక బహిష్కరణ చేస్తాం**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే ఇంతకాలం స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేశామన్న సీఎం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచొద్దని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసిందని రేవంత్? రెడ్డి తెలిపారు. అప్పుడు మంత్రులుగా ఉన్న బీసీలు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లతోనే కేసీఆర్ తమపై విమర్శలు చేయించారని ఆక్షేపించారు.అందరు కలిసి కట్టుగా రక్షణ కవచంలా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలని సూచించారు. ఎవరైనా కోర్టుకు వెళ్తే వాదించడానికి దిల్లీ నుంచి ఉద్దండులైన న్యాయకోవిదులను నియమిస్తామని చెప్పారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టినవారిని, వాళ్లతో పెట్టించినవారిని సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించాలంటూ బీసీలకు పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలకు త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు.

## ఓయూ పరిధిలో పీజీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

**టీ మీడియా జులై 15,ఉస్మానియా యూనివర్సిటీ :**
ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్ డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈనెల 22వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 300 అపరాధ రుసుముతో ఈనెల 29వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

**బీఈ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల వన్ టైం ఛాన్స్ పరీక్షలను ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు